# ప్రపంచ శ్రామిక విప్లవాల మేలి మలుపు

# చైనా నూతన ప్రజాస్వామిక విప్లవం

***(20-10-2019 సంచిక తరువాయి)***

చైనా ప్రజాతంత్ర విప్లవ విజయానికి అనుసరించిన సాధారణ పంథా "నగరాలను చుట్టుముట్టి అంతిమంగా వాటిని స్వాధీనం చేసుకోవడానికి గ్రామీణ ప్రాంతాలను ఉపయోగించుకోవటం". అయితే కామ్రేడ్ మావో రూపొందించిన ఈ పంథాకు పూర్తిగా భిన్నమైన మితవాద అతివాద పంథాలు చైనా కమ్యూనిస్టు పార్టీని చాలాకాలం వెంటాడి, ఘోరమైన నష్టాలకి కారణమైన సంగతిని విస్మరించ కూడదు. మొదటి అంతర్యుద్ధ కాలమైన 1924 - 27ల నడుమ చెన్ టు షీ అనుసరించిన మితవాద రాజకీయాల ఫలితంగా షాంఘై నగరంలో పొందిన చేదు అనుభవాలను క్లుప్తంగా తెలుసుకుని గ్రామీణ ప్రాంతాల అనుభవాలను చూద్దాం.

కొమింటాంగ్ పార్టీతో కలసి చైనా కమ్యూనిస్టు పార్టీ ఉత్తర ప్రాంత యుద్ధ ప్రభువులపై యుద్ధానికి వెళుతున్న నాటికి షాంఘై నగరంలో కమ్యూనిస్టుల ఉద్యమ నిర్మాణ కృషి చాలా చురుకుగా ఉండేది. 1925 మే 30న సామ్రాజ్యవాద వ్యతిరేక దేశభక్తియుత ఉద్యమంపై బ్రిటిష్ సామ్రాజ్య వాదులు దాడిచేసి సుమారు పదివేల మంది షాంఘై ప్రజలను ఊచకోత కోశారు. దీనికి నిరసనగా కార్మికులు, విద్యార్థులు, వ్యాపారులు, రైతులు దేశవ్యాపితంగా ప్రదర్శనలు చేశారు. వీటన్నిటిలోకి అతి పెద్దది ఎక్కువ ప్రభావం కలిగించింది కాంటన్, హాంగ్ కాంగ్ సమ్మె.

చైనా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలోని కార్మికులు, రైతులు ఉత్తర ప్రాంత యుద్ధ ప్రభువులపై దండయాత్రకు విప్లవ సైన్యానికి శక్తివంతమైన మద్దతుని అందించారు. షాంఘై, నాన్ కింగ్ తదితర నగరాలను దిగ్బంధించి జాతీయ విప్లవ సైన్యం మరింతగా పురోగమించి విజయాలు సాధించడానికి తోడ్పడ్డారు.

1926 అక్టోబర్ నుండి 1927 మార్చి నడుమ షాంఘైలో కార్మికులు మూడు తిరుగుబాట్లు నిర్వహించారు. మొదటి రెండు ఓటమికి గురైనా, ఉత్తర దండయాత్ర సైన్యం అందుబాటులో ఉన్నందువల్ల మూడవ తిరుగుబాటు విజయవంతమైంది. దానితో షాంఘైలో ప్రజా ప్రభుత్వ నిర్వహణకు అధికారుల్ని ఎన్నుకున్నారు.

ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో 1927 ఏప్రిల్లో చైనా కమ్యూనిస్టు పార్టీ తన ఐదవ మహాసభను నిర్వహించుకుని వ్యవసాయక విప్లవాన్ని పురోగమింప చేయాలనీ, ప్రజా పాలనను నెలకొల్పాలని నిర్ణయించింది. నాలుగవ మహాసభ నాటికి పార్టీ సభ్యత్వం 900 కాగా అయిదవ మహాసభ నాటికి 57,900 దాకా పెరిగింది. కార్మిక కర్షక సమరశీల ఉద్యమాల ఉద్ధృతికి ఇదొక నిదర్శనం. అప్పటికే కొమింగ్ టాంగ్ పార్టీలోని వామపక్ష అనుకూల సైన్యంతో కలిసి కమ్యూనిస్టులు వూహాన్ కేంద్రంగా ఒక ప్రభుత్వాన్ని ఏర్పరిచారు.

అయితే చెన్ టూ షి మితవాద అవకాశవాదం వల్లనూ, సామ్రాజ్యవాదులతో చేతులు కలిపిన ఛాంగ్ కై షేక్ కుట్రల ఫలితంగానూ కమ్యూనిస్టులపై సాగిన క్రూర మారణకాండకు ఆత్మరక్షణ లేకుండా పోయింది. వూహాన్ ప్రభుత్వం కూడా నిలవలేక పోయింది.

షాంఘై చుట్టుపక్కల గ్రామాలలో రైతాంగ ఉద్యమం లేనందువల్ల షాంఘై కార్మిక వర్గానికి అణచివేత నుండి తప్పించుకునే మార్గం లేకుండా పోయింది.

1927 ఆగస్టులో కామ్రేడ్స్ చౌ ఎన్ లై, ఛూటేల నాయకత్వాన నాన్ ఛాంగ్ తిరుగుబాటు జరిగింది. రైతాంగ ఉద్యమంతో మిళితం కాకపోవటం, శత్రువు బలాధిక్యత వల్ల తిరుగుబాటు ఓడిపోయింది.

ఆ విధంగా నగరాలలో కార్మికుల తిరుగుబాటు, మొదటి అంతర్యుద్ధ ప్రయత్నాలు ఘోరంగా విఫలమైనాయి.

దీనికి ముఖ్య కారణం చెన్ టూ షి అనుసరించిన మితవాద అవకాశవాదాలలో వుంది. బూర్జువా ప్రజాతంత్ర విప్లవానికి బూర్జువావర్గమే నాయకత్వం వహించాలనే దృక్పథమే కాక రైతాంగాన్ని ఆధారపడదగిన విప్లవశక్తిగా పరిగణించకపోవటంలోనూ వుంది.

**'హూనాన్ రైతాంగ ఉద్యమ అధ్యయన నివేదిక - కామ్రేడ్ మావో**

కామ్రేడ్ మావో 1924 నుండి కొమింగ్ టాంగ్ పార్టీ ప్రచార విభాగపు కార్యదర్శిగా ఉంటూ రైతాంగ పాఠశాలలు నిర్వహించాడు. రైతాంగ ఉద్యమ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చే సంస్థను నడిపే బాధ్యతను స్వీకరించాడు. 1925 తర్వాత కార్మిక రైతాంగ ఉద్యమాలు పురోగమించాయి. చౌ ఎన్ లై మాటల్లో "ఈ ఉద్యమాల నుంచి విప్లవం, రైతాంగ విప్లవ యుద్ధంగా రూపొందుతున్నదని, ఆనాటి మొత్తం ధోరణి అదేనని, చై.క.పా. లో గుర్తించగలిగిన వారికి ప్రతినిధి కామ్రేడ్ మావో జెడాంగ్. "రైతాంగపు భూమి సమస్యను పరిశీలించి "చైనాలో ఒక వర్గ పరిశీలన" లాంటి అధ్యయన పత్రాలను 20కి పైగా మావో ప్రచురించాడు.

చైనా బూర్జువా ప్రజాతంత్ర విప్లవానికి బూర్జువావర్గం నాయకత్వం వహించి నిజమైన జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పరచ గల పరిస్థితి లేదనీ, కనుక కార్మిక వర్గమే నాయకత్వం

అందించాలని చెప్పారు. బూర్జువా ప్రజాతంత్ర విప్లవానికి వ్యవసాయ విప్లవం ప్రధాన సారంగా ఉంటుందని, రైతాంగం ఈ విప్లవానికి కీలక శక్తి అనీ, ఆయన శాస్త్రీయంగా అంచనా వేశారు. అలా విప్లవ ప్రభుత్వ స్థాపనకోసం కార్మిక వర్గ చైతన్యంతో రైతాంగాన్ని ధైర్యంగా కదలించాలని, గ్రామీణ ప్రాంతాలలో రైతులు సొంత సైన్యం నిర్మాణం చేసుకోవాలనే ప్రాథమిక భావాన్ని ఆయన రూపొందించారు. అందులో భాగంగా కామ్రేడ్ మావో రూపొందించిన **"హూనాన్ రైతాంగ ఉద్యమ అధ్యయన నివేదిక"** గొప్ప ప్రాముఖ్యం కలిగిన చారిత్రాత్మక పత్రం. కార్మిక వర్గం రైతాంగానికి నాయకత్వం వహించ గలుగుతుందా లేదా అనే దానిమీదే చైనా విప్లవ విజయం ఆధారపడి ఉందని కామ్రేడ్ మావో శాస్త్రీయ అవగాహనతో పేర్కొన్నారు. చెన్ టు షి మితవాద అవకాశ వాదానికి, ఛాంగ్ కై షేక్ పట్టణ ప్రాంత కమ్యూనిస్ట్ ఉద్యమంపై సాగించిన హత్యాకాండకు తట్టుకుని నిలిచిన రైతాంగ ఉద్యమ స్థావరాలను నిర్మించు కోగలిగారు. రైతులు భూస్వాముల భూముల్ని ఆక్రమించి, ఫ్యూడల్ భూస్వాములను, కర్ర పెత్తందార్లను, లంచగొండి ఉద్యోగులను శిక్షించారు."అన్ని అధికారాలు రైతు సంఘాలకే" అన్న నినాదాన్ని అమలుపరిచారు. భూస్వాము లను ఆర్థికంగా, రాజకీయంగా, సైనికంగా ఓడించి వారి పరిపాలనను నిర్మూలించారు. రైతాంగ ఆత్మరక్షణ దళాల ద్వారా రౌడీ మూకలను తుడిచి పెట్టారు. సహకార సంఘాలు స్థాపించుకున్నారు. రైతుఉద్యమం ద్వారా పెంపొందిన సంఘటిత శక్తితో గ్రామాలకు రోడ్లు వేసి, చెరువులు మరమ్మతు చేసుకుని వ్యవసాయాన్ని మెరుగుపరుచుకున్నారు. భార్య, భర్తల మధ్య వివాదాలు కూడా రైతు సంఘాలు పరిష్కరించాయి. విద్యా వ్యాప్తి చేశారు. జూదాన్ని నిషేధించారు. దొంగతనాలను నిర్మూ లించారు. తమ రక్తమాంసాలు హరించిన ఫ్యూడల్ పెత్తందారి శత్రువులను రైతాంగం సంఘటితంగా ప్రతిఘటించారు. ఆ రైతాంగ విప్లవ వెల్లువ అందించిన అనుభవాల నుండి మావో చేసిన ప్రఖ్యాతి చెందిన సూత్రీకరణను ఒకసారి గుర్తు చేసుకుందాం. **"విప్లవమంటే విందు భోజనం కాదు. చిత్ర పటం గీయడం లేక ఒక వ్యాసం వ్రాయడం , లేక సూదితో చక్కని అల్లిక నేయటం కాదు. అది మర్యాదగా, నెమ్మదిగా, దయగా , సుతారంగా ఉండదు. ఒక వర్గం మరొక వర్గంపై తిరుగుబాటు చేసి, హింస ద్వారా అధికారం నుండి తొలగించటమే విప్లవం. లేనిచో తప్పులను సరిదిద్ద లేము."**

రైతాంగానివి దుందుడుకు చర్యలు అంటూ చెన్ టూ షి నాయకత్వం ఖండించింది. 5వ పార్టీ మహాసభలో కామ్రేడ్ మావోకు ఓటింగు హక్కుని లేకుండా చేశారు. అయితే చైనా కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా ఉండిన చెన్ టూ షి అనుసరించిన మితవాదపు తప్పిదాల వల్ల పట్టణ ప్రాంతాల ఉద్యమం ఘోర అణిచివేతకు గురికాగా గ్రామీణ ప్రాంత రైతాంగ ఉద్యమమే వారికి రక్షణ స్థావరం అయింది.

ఛాంగ్ కై షేక్ సైనిక దాడులను, క్రూర అణచివేతను, ఊచకోతలను తట్టుకోవడానికి హూనాన్ కు ఇంకా లోతట్టున ఉండే ఎత్తయిన పర్వతాలు, దట్టమైన అడవుల నడుమన గల చింగ్ కాంగ్ పర్వత శ్రేణి నడుమకు మావో తన ఎర్ర సైనిక స్థావరాన్ని తరలించవలసిన వచ్చింది. ఛాంగ్ కై షేక్ సామ్రాజ్యవాదులకు పూర్తిగా లొంగిపోయిన స్థితిలో కొమింగ్ టాంగ్ సైన్యం నుండి కొంత భాగాన్ని కామ్రేడ్ ఛూటే తన వెంట చింగ్ కాంగ్ పర్వత ప్రాంతానికి తెచ్చుకోగలిగాడు. అలాగే పట్టణ ప్రాంత కార్మిక ఉద్యమంపై సాగిన ఊచకోత నుండి తప్పు కోవడానికి కామ్రేడ్ చౌ ఎన్ లై నాయకత్వాన మరొక విప్లవ బృందం మావో నిర్మించిన స్థావర ప్రాంతానికి చేరుకుంది. పై మూడు బృందాలు ఎర్రసైన్యంగా కలగలిసి పోయాయి. ఎర్ర సైన్యంలో ప్రజాతంత్ర వ్యవస్థ ప్రవేశపెట్టారు. స్థానిక రైతాంగ శక్తులు తమకై తాము సాయుధ మవటానికి ఎర్రసైన్యం సహాయపడింది.

కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో సైద్ధాంతిక కృషి కీలకమైనది కాబట్టి శ్రామికవర్గ సైద్ధాంతిక నాయకత్వాన్ని పటిష్టం చేయటము, పెటి బూర్జువా దృక్పధాన్ని మార్చటమూ గొప్ప ప్రాధాన్యం కలిగి ఉన్న విషయాలని కామ్రేడ్ మావో చెప్పాడు. శత్రు బలగాలు సాపేక్షంగా బలహీనంగా ఉన్న ప్రాంతాలలో విప్లవ శక్తులు నిలదొక్కుకోవడం, అక్కడి నుండి విస్తరించడం సాధ్యమేనని రుజువు పరిచారు.

అయితే చైనా దీర్ఘకాలిక విప్లవ పోరాటం–సామ్రాజ్యవాదుల, ఫ్యూడల్ శక్తుల రాజకీయ ప్రతినిధి అయిన ఛాంగ్ కై షేక్ సైన్యాల దాడులకు, చుట్టి వేతలకు ఐదుసార్లు గురయింది. అంతేకాదు. చెన్ టూ షి మితవాద అవకాశవాదం తర్వాత మూడు రకాల అతివాద పంథాలకు వరుసగా బలయింది కూడా.

మొదటి అతివాదపంథా చూచి పాయ్ ది. ఇతడు "పట్టణాలలోని కొమింగ్ టాంగ్ కార్మిక సంఘ నాయకులను హత్య చేయాలని, బ్యాంకులను దోచి పోలీసు స్టేషన్లపై దాడి చేయాలని ఒక అతివాద కార్యక్రమాన్ని పార్టీ కార్యదర్శిగా శ్రేణులకు అందించాడు. ఆత్మహత్యా సదృశమైన ఈ అతివాద కార్యక్రమాన్ని మావో తిరస్కరించాడు." (హాన్ సూయిన్ రచన 'వెలుగు వెల్లువ' నుండి) మావో అనుసరిస్తున్నవే దుందుడుకు విధానాలని పార్టీ నాయకత్వం విమర్శించడమే కాక కేంద్ర కమిటీ నుంచి కూడా మావోను తొలగించారు; నిందించారు కూడా! అయినా మావో పార్టీనుండి వైదొలగ లేదు. పార్టీ వ్యతిరేకి కాలేదు. చైనా వాస్తవ పరిస్థితులను గుర్తించి సిద్ధాంత ప్రాతిపదికపై విప్లవ పురోగమనానికి ప్రజా సంఘాల నిర్మాణం చేశాడు. పార్టీ కార్యదర్శి చూ చి పాయ్ పెట్టుబడిదారీ వర్గాన్నంతా నిర్మూలించాలి అంటుంటే, మావో "రైతాంగాన్ని చైతన్య పరచాలి, వ్యవసాయ సంస్కరణలకై జరిగే వర్గ పోరాటంలో రైతాంగం పూర్తిగా పాల్గొని తమ స్వానుభవంతో

చైతన్యం పొంది, పూర్తి ప్రజా సహకారంతో రైతాంగ గెరిల్లాలు నిరంకుశ భూస్వాములపై దాడి చేసి తుపాకులు ఇతర ఆయుధాలు సంపాదించాలి" అనే ప్రత్యామ్నాయ పంథాను నిర్మించాడు. అతివాద పంథా కారణంగా పార్టీ, ఉద్యమం, నిర్మాణ శక్తులూ నష్టపోగా కామ్రేడ్ మావో నాయకత్వాన, ఒకవైపు శత్రువు సైనిక దాడులు సాగిస్తుండగా మరోవైపు అంతర్గత అతివాద ఉద్రేకవాదాన్ని తట్టుకుంటూ స్థావర ప్రాంతాలు నిర్మాణ యుతంగా నిలదొక్కుకుని కొనసాగాయి.

కొమింటాంగ్ ప్రగతి నిరోధకుల ఊచకోత విధానాలపై ద్వేషంతోనూ, చెన్ టూ షి మితవాద లొంగుబాటు విధానం పట్ల క్రోధంతోనూ, వెరసి – పెటీబూర్జువా అసహనంతో మొదటి అతివాద పంథా పైచేయి సాధించింది.

పార్టీలో ఉండే తప్పుడు భావాలే తప్పుడు రాజకీయ పంథాకు వనరుగా ఉంటాయి కాబట్టి సరైన సైద్ధాంతిక పునాదిపై పార్టీని నిర్మించు కోవడం అత్యంత ఆవశ్యకమని కామ్రేడ్ మావో చెప్పారు. అలా నిర్మాణం చేశారు కూడా!!

ఒక్క సంవత్సర కాలంలో వైఫల్యాలకి గురైన మొదటి అతివాద పంథా సైద్ధాంతికంగా రాజకీయంగా బట్టబయలై ఓటమికి గురయిన వెంటనే కామ్రేడ్ లీ లి సాన్ పార్టీ నాయకుడై రెండవ అతివాద పంథాను ముందుకు తెచ్చాడు.

1930 జూన్‌లో దేశవ్యాప్తంగా ఉన్న ప్రధాన నగరాలలో సాయుధ తిరుగుబాట్లను నిర్వహించడానికి, ప్రధాన నగరాలపై దాడి చేయడానికి ఎర్రసైన్యానికి చెందిన అన్ని యూనిట్లను కేంద్రీకరించేందుకు "అతివాదులు" దుస్సాహసిక పథకాన్ని రూపొందించారు. **విప్లవ వెల్లువకు, విప్లవ పరిస్థితికి నడుమగల తేడాను** గ్రహించక పోవడమే కాక , శత్రువు బలాన్ని తక్కువగానూ పార్టీ నిర్మాణ శక్తిని ఎక్కువగానూ లీ లీ సాన్ అంచనా కట్టాడు. ప్రజాతంత్ర విప్లవానికి, సోషలిస్టు విప్లవానికి మధ్య ఉన్న విభజన రేఖను చెరిపేశాడు. ఈ పంథా 3 నెలలు మాత్రమే పైచేయి సాధించినా పొందిన నష్టం చిన్నదికాదు. ఈ కాలంలోనే ఛాంగ్ కై షేక్ సైన్యాలు ఎర్రసైన్యపు స్థావర ప్రాంతాలపై మొదటి చుట్టివేత దాడికి ప్రయత్నించి విఫలమయ్యాయి. కామ్రేడ్ మావో మితవాద, అతివాదాలకు వ్యతిరేకంగా అనుసరించిన వ్యవసాయక విప్లవ దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథా నుండి లభించిన సంఘటిత శక్తివల్లనే ఛాంగ్ కై షేక్ దాడిని తిప్పి కొట్టగలిగారు.

మితవాద పంథా నాయకుడు చెన్ టూ షి విచ్ఛిన్నకుడుగా ట్రాట్స్కీయిస్ట్ గా దిగజారి పోయాడు. ఫలితంగా పార్టీ నుండి 1929లో బహిష్కృతుడైనాడు. లీ లీ సాన్ తన అతివాద తప్పిదాలకు 1930 సెప్టెంబరులో జరిగిన ఆరవ కేంద్ర కమిటీ యొక్క మూడవ ప్లీనరీ సమావేశంలో ఆత్మ విమర్శ చేసుకుని, సెంట్రల్ కమిటీకి రాజీనామాచేసి, పార్టీలోనే కొనసాగాడు. అయితే అతివాదంపై లోతైన విస్తారమైన చర్చ జరుగనందువల్ల మరొక అతివాద పంథా ఇంకొకసారి పార్టీని చుట్టుముట్టింది. ఈసారి దాని నాయకుడు వాంగ్ మింగ్ . దాన్ని గురించి తెలుసుకో బోయే ముందు చాంగ్ కై షేక్ సైన్యాల చుట్టివేత దాడుల గురించి క్లుప్తంగా తెలుసుకొందాం.

మొదటి దాడి 1930 డిసెంబర్ చివరి నాలుగు రోజులు జరిగింది.

రెండవ దాడి 1931 ఏప్రిల్ లో రెండు లక్షల మంది సైనిక బలగంతో జరిగింది.

1931 జూలైలో మూడు లక్షల సైన్యాలకు నాయకత్వం వహిస్తూ జర్మనీ జపాన్ మిలటరీ నిపుణుల సహాయంతో ఛాంగ్ కై షేక్ స్వయంగా దాడికి పూనుకొన్నాడు. అయినా ఎర్రసైన్యం ప్రతిఘటించి ఓడించగలిగింది. కాల పరీక్షకు దిగ్విజయంగా నిలబడి విస్తరించింది. ప్రతిఘటన యుద్ధంలో ఎర్రసైన్యం కేవలం తిరుగుదాడి చేయటం గురించి మాత్రమే కాక ఆత్మరక్షణ, పురోగమనం, ఉపసంహరణ – ఇవన్నీ దృష్టిలో ఉంచుకోవాలి అని మావో చెప్పారు.

నాలుగవ, ఐదవ చుట్టివేతల దాడిని ఎదుర్కోవలసి వచ్చిన కాలానికి పార్టీని అత్యంత తీవ్రంగా నష్టపరిచిన వాంగ్ మింగ్ అతివాదం ముందుకొచ్చింది. లీ లీ సాన్ ది అతివాదం ముసుగులో ఉన్న మితవాదం. వాంగ్ మింగ్ అతివాదం 1931లోనే తలయెత్తింది. అదే సంవత్సరం సెప్టెంబరులో జపాన్ దేశ సైన్యాలు చైనా ఈశాన్య ప్రాంతమైన మంచూరియాపై దాడి జరిపాయి. 3 రాష్ట్రాలను జపాను ఆక్రమణకు అంగీకరిస్తూ ఛాంగ్ కై షేక్ జపానుతో ఒప్పందం కుదుర్చు కున్నాడు. పారిశ్రామిక మహా నగరమైన షాంఘైపై 1932 జనవరిలో జపాను దాడి చేసింది. షాంఘైలో జపాను దురాక్రమణ దారులకు వ్యతిరేకంగా పోరాడుతున్న 19వ రూట్‌ఆర్మీని షాంఘై నుంచి విరమించుకునేలా వత్తిడి చేసిన తర్వాత జపానుతో షాంఘై యుద్ధవిరమణ ఒప్పందాన్ని కుదుర్చుకున్నాడు. షాంఘై పెకింగ్ కార్మికులు "జపానుని ప్రతిఘటించండి–చైనాను రక్షించండి" అంటూ ఉద్యమించారు. విదేశీ మంత్రిత్వశాఖ కార్యాలయాలపై దాడులు చేశారు. అయినా జపాన్‌పై పోరాడకుండా ఛాంగ్ కై షేక్ 1932 జూన్ నుండి 1933 ఫిబ్రవరి వరకు 5 లక్షల మంది సైనిక బలగంతో, 1931లో ఏర్పడిన చైనా సోవియట్ ప్రాంతంపై, నాల్గవ చుట్టివేత దాడి సాగించాడు. జపాను సామ్రాజ్యవాద దురాక్రమణకు వ్యతిరేకంగా చైనా దేశం దేశమంతా పోరాడవలసిన సమయంలో, ఒకవైపున బయట నుండి ఛాంగ్ కై షేక్ కమ్యూనిస్టులపై దాడిచేస్తూ ఉండగా, పార్టీలో నాయకత్వాన్ని చేజిక్కించుకున్న వాంగ్ మింగ్ అతివాదం , మావో నాయకత్వాన్ని మితవాదులు అంటూ, వీరిది ధనిక రైతు తత్వం అంటూ పార్టీ లోపలనుండి తీవ్ర దాడి సాగించారు. కామ్రేడ్స్ మావో, ఛూటేలు జపాన్ వ్యతిరేక ప్రతిఘటనకు ఇచ్చిన పిలుపు చైనా దేశభక్త ప్రజానీకంపై మంచి ప్రభావం చూపింది కానీ వెలుపల

నుండి ఛాంగ్ కై షేక్ దాడిని, పార్టీ లోపలనుండి వాంగ్ మింగ్ అతివాద ప్రమాదాన్ని ఏక కాలంంలో ఎదుర్కోవలసి వచ్చింది. ఛాంగ్ కై షేక్ సాగించిన నాలుగవ చుట్టివేతను ఓడించగలిగారు కానీ వాంగ్ మింగ్ అతివాదం వలన 90 శాతం పార్టీ సభ్యత్వాన్ని, ఎర్రసైన్యాన్నీ నష్టపోయింది. 1933 ఆగస్టులో అమెరికా ఇంగ్లాండ్‌లు అందించిన ఆర్థిక వనరులతో, హిట్లర్ పంపిన జర్మన్ నాజీ సైనిక నిపుణుల ప్రత్యక్ష పర్యవేక్షణలో 150 బాంబర్ విమానాలతో, 10 లక్షల సైనిక బలగంతో ఛాంగ్ కై షేక్ ఐదవ చుట్టివేత దాడి ప్రారంభించాడు. 10 లక్షల మందికి పైగా రైతాంగాన్ని హతమార్చారు. 17 జిల్లాల కేంద్ర స్థావర ప్రాంతం ఆరు జిల్లాలకు కుదించుకుపోయింది. నిజానికి ఈ స్థావర ప్రాంతానికి ఐదవ చుట్టి వేత నుండి తప్పించుకునే అవకాశం వచ్చింది.

ఛాంగ్ కై షేక్ 1933లో సాయ్ టింగ్ కై అనే సైన్యాధికారిని కమ్యూనిస్టులపై దాడికి పుకియన్ రాష్ట్రానికి పంపించాడు. ఇతనికి షాంఘైపై దాడి చేసిన జపాను సైన్యాన్ని ప్రతిఘటించిన చరిత్ర ఉంది. అతను కమ్యూనిస్టులపై దాడి చేయకుండా ఛాంగ్ కై షేక్‌పై తిరుగుబాటు చేశాడు. పుకియన్ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పరచాడు. మావో, ఛూటేలు అప్పటికే జపాను దురాక్రమణ దారులతో పట్టుదలగా పోరాడేవారెవరితోనైనా ఐక్యసంఘటనకు సిద్ధమని ప్రకటించి ఉన్నారు. అయితే పుకియన్ ప్రభుత్వంతో ఒక అవగాహనకు రావటానికిగల అవకాశాలను వాంగ్ మింగ్ అతివాదం కొట్టిపారేసింది.

అలాంటి విపత్కర పరిస్థితులలో ఛాంగ్ కై షేక్ జరిపిన ఐదవ చుట్టివేత దాడినుండి తప్పుకోవడానికి ఎర్రసైన్యం 1934 అక్టోబర్‌లో లాంగ్ మార్చ్‌ని ప్రారంభించక తప్పలేదు.

**ఏకైక చారిత్రాత్మక ఘట్టం లాంగ్ మార్చ్**

లక్షమంది ఎర్ర సైన్యంతో బయలుదేరిన లాంగ్ మార్చ్ లక్ష్య స్థావరానికి చేరుకునేటప్పటికి 30 వేల మంది మిగిలారు. వారంతా 12వేల 500 కిలోమీటర్ల దూరం సంవత్సర కాలంలో 11 రాష్ట్రాలగుండా కాలినడకన ప్రయాణించారు. ఎత్తయిన అనేక మంచు పర్వతాలను, నర సంచారంలేని మరుభూములను, దట్టమైన అడవులను, శత్రువు దాడులతో చుట్టుముట్టిన చక్ర బంధాలను, టాటూలాంటి అనేక నదీ ప్రవాహాలను అధిగమిస్తూ, అధిరోహిస్తూ, దాటుకుంటూ, ఈదుకుంటూ , ఎదుర్కొంటూ, సాయుధ యుద్ధాలుకావిస్తూ 'నభూతో న భవిష్యతి' అన్నట్లు సాగిన చారిత్రాత్మక సంఘటన లాంగ్ మార్చ్!

"దారిపొడవునా గుండె నెత్తురులు తర్పణ చేస్తూ పదండి ముందుకు! నదీనదాలు అడవులు కొండలు ఎడారులా మన కడ్డంకి!!" అని అప్పటికే రాసేసిన మహాకవి శ్రీశ్రీ అక్షరాలను అడుగడుగునా నిజం చేస్తూ సాగిందా 'మహాయాత్ర' ! సామాన్య మానవుల అసమాన త్యాగ సాహసాలను అమోఘంగా ప్రదర్శించిన చైతన్య ప్రతిరూపం ఈ మహాప్రస్థానం!!

ఈ నడుమ కాలంలో జపాను సామ్రాజ్య వాదులు ఉత్తర చైనా దురాక్రమణకు పూను కొన్నప్పటికీ కొమింటాంగ్ పార్టీ లొంగుబాటు షరతులను ఆమోదిస్తూ ఉంది.

1934 అక్టోబరులో దక్షిణ చైనాలోని జియాంగ్సీ నుండి ఉత్తర చైనాలోని ఏనాన్ ప్రాంత షాంక్సి విప్లవ స్థావరానికి 1935 అక్టోబరు నాటికి లాంగ్ మార్చ్ చేరుకుంది. ప్రపంచ చరిత్రలోనే లాంగ్ మార్చ్‌కి సాటి రాగలిగినది మరొకటి లేదు. ఎర్రసైన్యం అజేయమైనదని ఇది ధ్రువీకరించింది. 11 రాష్ట్రాలలో ఆందోళనా దళాలను , విప్లవ బీజాలను నాటుకుంటూ 20 కోట్ల మందికి ప్రజా విముక్తి బాటను ఎర్రసైన్యం స్వయంగా ఎరుకపరిచింది. సామ్రాజ్యవాదుల దళారిగా వ్యవహరిస్తున్న ఛాంగ్ కై షేక్ సైనిక దళాల చుట్టివేతల క్రౌర్యాలను, వైఫల్యాలను బట్టబయలు చేసింది. అంతిమ సారాంశంలో జపాను సామ్రాజ్యవాదుల నుండి చైనా దేశానికి విముక్తి కలిగించటానికి గట్టి హామీ ఇచ్చింది .

లాంగ్‌మార్చ్ సాగుతున్న దారిలోనే చైనా కమ్యూనిస్టు పార్టీ చరిత్రలోనే ఒక మహత్తరమైన మలుపు లాంటి సంఘటన జరిగింది. 1935 జనవరి 6 నుండి 8 వరకు సున్యీ అనే చోట చై.క.పా. పొలిట్ బ్యూరో విస్తృత సమావేశం జరిగింది. స్థావర ప్రాంతాలను, ఎర్రసైన్యాన్ని నష్టపోవడానికి గల పొరపాట్లను గురించి లోతైన చర్చలు జరిగాయి. కామ్రేడ్ మావో చేసిన విమర్శలను, యిచ్చిన వివరణలను, ఎత్తి చూపిన లోపాలను అత్యధికులు స్వీకరించారు; ఆమోదించారు. మితవాదం యొక్క ఘోర వైఫల్యాలను, ఒకదాని వెంట ఒకటిగా చుట్టు ముట్టిన 3 అతివాదాల చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకొని కామ్రేడ్ మావోని పార్టీ ఛైర్మన్‌గా, పొలిటికల్ కమిస్సారుగా ఎన్ను కున్నారు. ఇది చై.క.పా. పార్టీ చరిత్రలో మూల మలుపే కాక మేలు మలుపు కూడా అయింది. సున్యీ సమావేశం వాంగ్ మింగ్ అతివాద మిలటరీ పంధాను తిరస్కరించింది. లాంగ్ మార్చ్‌కి అప్పటికి లేని స్పష్టమైన లక్ష్య నిర్దేశం చేసింది. చురుకైన గెరిల్లా ఎత్తుగడలను రూపొందించింది. అతివాద ముసుగులోని చాంగ్ కువా టావో చీలిక ధోరణులను ఓటమి పంథాను పక్కకు నెట్టింది. ఎర్రసైన్యం ఉత్తరదిశగా తన ప్రయాణాన్ని మలుచుకుంది. 1935 అక్టోబర్ 20న మావో ఎర్ర సైన్యంతో షెన్సీ - కాన్సూ స్థావరానికి చేరుకున్నారు. ఈలోగానే జపాను వ్యతిరేక పోరాటం చైనా ప్రజలందరి ఉమ్మడి కర్తవ్యమని, అందరూ అందుకు సంసిద్ధులు కావాలని పిలుపునిచ్చారు. ఆ పిలుపు చైనా దేశభక్త ప్రజానీకంపై గొప్ప ప్రభావాన్ని కలిగించింది. ఛాంగ్ కై షేక్ అనుసరిస్తూన్న జపాను సామ్రాజ్యవాద అనుకూల, చైనా కమ్యూనిస్టు పార్టీ వ్యతిరేక విధానాలపట్ల ప్రజలలో నిరసన పెల్లుబుకటానికి దోహదపడింది. జపాను సామ్రాజ్యవాదంతో పోరాటానికి దిగిన ఎర్రసైన్యం తన బలాన్ని బలగాన్ని పెంచుకోవటానికి అది మార్గాన్ని సుగమం చేసింది.

**జపాన్ వ్యతిరేక ఐక్య సంఘటన**

కామ్రేడ్ మావో సూత్రీకరించిన 'వైరుధ్యాలు'లో జపాన్ సామ్రాజ్యవాదానికి చైనా ప్రజలకు నడుమ ప్రధాన వైరుధ్యం ఏర్పడింది. దాని పరిష్కారానికై సామ్రాజ్యవాద వ్యతిరేక దేశభక్త ప్రజానీకమంతా అంతర్గత వైరుధ్యాలను మరచి ఐక్య సంఘటనగా జాతీయ ప్రజాతంత్ర రిపబ్లిక్ ఏర్పాటుకోసం ఒకే త్రాటిపైకి రావలసి ఉంది. అందుకై చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రజలందరికీ, రాజకీయ పార్టీలకు ఒక బహిరంగ పిలుపునిచ్చింది. అయితే ఛాంగ్ కై షేక్ అందుకు సిద్ధంగా లేడు. ఒకవైపున ప్రజానీకంలో సామ్రాజ్యవాద వ్యతిరేక వెల్లువ ఉరకలెత్తుతున్నా, కమ్యూనిస్టు లపై దాడులుచేసి మట్టు పెట్టటమే తన విధానంగా వ్యవహరిస్తున్నాడు. ఇలాంటి దేశద్రోహకర జిత్తులకు వ్యతిరేకంగా కొమింగ్ టాంగ్ సైన్యంలో విభేదాలు తలెత్తాయి. జపాన్ వ్యతిరేక ప్రజా ఉద్యమంతో ఉత్తేజితులైన చాంగ్, యాంగ్ అనే సైన్యాధికారులు1936 డిసెంబరు12న సియన్ అనే చోట ఛాంగ్ కై షేక్‌ను నిర్బంధించారు. మొత్తం దేశ ప్రయోజనాల దృష్ట్యా చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ సియన్ ఘటనకు శాంతియుత పరిష్కారాన్ని సూచించింది. ఫలితంగా జపానును వ్యతిరేకించడానికి, కమ్యూనిస్టులతో కలవడానికి ఛాంగ్ కై షేక్ అంగీకరించిన తర్వాత మాత్రమే అతడిని చాంగ్, యాంగ్‌లు విడుదల చేశారు.

**జపాన్ వ్యతిరేక జాతీయ విముక్తి పోరాటం**

జపాన్ దురాక్రమణను తాను ప్రతిఘటిస్తానని ఛాంగ్ కై షేక్ 1937 జూలైలో ప్రకటించినప్పటికీ ఆయన ఊగిసలాట వైఖరినే ప్రదర్శించాడు. అదే నెల ఆఖరులో కామ్రేడ్ మావో " జపాన్ దురాక్రమణను ప్రతిఘటించడంలో అను సరించాల్సిన విధానాలు, చర్యలు, దృక్పథాలు" అనే వ్యాసాన్ని, ఆ తర్వాత "దీర్ఘకాలిక యుద్ధం" అనే పుస్తకాన్ని వెలువరించారు. కొంతమంది భ్రమపడినట్లు యుద్ధం రేపో మాపో తేలిపోయేదికాదనీ, దీర్ఘకాలిక స్వభావం ఉందని, శత్రు-మిత్ర పక్షాల బలాలను బలహీనతలను వాస్తవిక దృక్పథంతో అర్థం చేసుకుని, చైతన్యయుత కార్యాచరణ ద్వారా ప్రజల పైన ఆధారపడితేనే విజయం సాధ్యపడుతుందని, అది తథ్యమని ఆయన చెప్పారు. జపాన్ వ్యతిరేక పోరాటానికి మూడు దశలు - వ్యూహాత్మక ఆత్మరక్షణ, వ్యూహాత్మక ప్రతిష్టంభన, వ్యూహాత్మక దాడిగా ఉంటాయని, గెరిల్లా యుద్ధ ఎత్తుగడలు, సంచాలక (మొబైల్) యుద్ధరీతులు, స్థావర యుద్ధ పద్ధతులు అనుసరించాలని, ప్రపంచ దేశీయ రాజకీయ పరిణామాల కనువుగా యుద్ధకళను ప్రయోగించాలని మావో చెప్పారు. వ్యూహాత్మక ఐక్య సంఘటనలో కమ్యూనిస్టు పార్టీ స్వతంత్ర ఎత్తుగడలతో సమన్వయించుకోవాలని ఆయన చెప్పారు. కొమింగ్ టాంగ్ పార్టీ ఊగిసలాట, రాజీ, లొంగుబాటు ధోరణులను, అవకాశవాద చర్యలను మొదటి నుండి చివరికంటా ప్రదర్శిస్తూనే ఉంది. 1940 చివరలో కమ్యూనిస్టుల సైన్యాలపై భారీ దాడిచేసి జపానుకు లొంగి పోదామని కుట్రపన్నిన కొమింగ్ టాంగ్‌కు చెందిన కమ్యూనిస్టు వ్యతిరేక మొండిఘటాల దుర్మార్గపు చర్యలను బట్టబయలు చేయగలిగారు. తద్వారా సోవియట్ యూనియన్ పై సైనిక దాడి చేయాలనే జపాన్ ఎత్తుగడను వమ్ము చేశారు.

జపాను దూరాక్రమణదారులకు వ్యతిరేకంగా ఉద్రిక్త పోరాటం తీవ్రంగా జరుగుతున్న కాలంలో (1941-42)కూడా కమ్యూనిస్టు పార్టీలో దిద్దుబాటు ఉద్యమాన్ని మావో ప్రారంభించారు.

1. స్వీయ మానసిక వాదానికి వ్యతిరేకంగా అధ్యయనం తీరులో దిద్దుబాటు.
2. ఒంటెత్తు వాదానికి వ్యతిరేకంగా పార్టీ పని పద్ధతిలో దిద్దుబాటు.
3. పడికట్టు పద బంధాలకు వ్యతిరేకంగా సాహితీ శైలిలో దిద్దుబాటు.

దీని గురించి మావో ఇలా చెప్పారు. "రాజకీయ ఉద్యమ అనుభవం, చరిత్ర, విప్లవ సిద్ధాంత జ్ఞానం లేనిదే ఏ రాజకీయ పార్టీ కూడా విప్లవ ఉద్యమానికి నాయకత్వం వహించి విజయం సాధించజాలదు. మార్క్సిజాన్ని చైనా ప్రత్యేక పరిస్థితులకు అన్వయించి, జాతీయ స్వభావం కలిగించినప్పుడు మనం మార్క్సిజాన్ని ఆచరించగలం. "

పార్టీ నిర్మాణ శక్తులను విమర్శ- ఆత్మ విమర్శలకు గురిచేసి ప్రక్షాళన కావించడం ద్వారా తక్షణ ఉద్యమ ప్రయోజనాలను, దీర్ఘకాలిక రాజకీయ లక్ష్యాలను సాధించ గలిగారు.

1945లో చైనా కమ్యూనిస్టు పార్టీ ఏడవ కాంగ్రెస్ జరిగింది. అంతకుముందు 1928లో ఆరవ కాంగ్రెస్ మాస్కోలో జరిగింది. జపాన్ వ్యతిరేక పోరాటం, దిద్దుబాటు లేక వడపోత ఉద్యమాల నుండి గడించిన చారిత్రక రాజకీయ అనుభవాలను మావో విశ్లేషించి క్యాడర్‌కు బోధించారు. సత్యం కోసం నిలబడాలి! తప్పులు దిద్దుకోవాలి!! ఈ నినాదాలు పతాక శీర్షిక గా నిలిచాయి. "సంకీర్ణ ప్రభుత్వాన్ని గురించి" అనే శీర్షికతో మావో రాజకీయ నివేదికను ప్రవేశపెట్టారు. మావో నాయకత్వాన్ని 7వ పార్టీ కాంగ్రెస్ ఆమోదించింది. చాంగ్ కువో టావో, వాంగ్ మింగ్‌లు అనుసరించిన విధానాలను మహాసభ ఖండించింది. నూతన ప్రజాస్వామిక చైనాను నిర్మించడం చైనా ప్రజల కర్తవ్యంగా ఆ మహాసభ పిలుపునిచ్చింది.

ఈ మహాసభలో పార్టీ ప్రాథమిక రాజకీయ నిర్మాణ పంథా ప్రజాపంథాగా ఉండాలని పార్టీ నూతన నిబంధనావళిలో ప్రత్యేకంగా నొక్కి చెప్పారు. పార్టీ నిర్మాణము, పార్టీ పని విశాల ప్రజానీకంతో సన్నిహిత సంబంధం కలిగి ఉండాలని నిబంధనావళి చెప్పింది. ప్రతి పనిని ప్రజల తరపున మాత్రమే చేయాలి. ప్రజల యెడల బాధ్యతను పూర్తిగా నెరవేర్చాలి. వారి స్వీయ విముక్తిలో విశ్వాసం ఉంచాలి. ప్రజల నుంచి నేర్చుకోవాలి. సిద్ధాంత వాదం, అనుభవవాదం అనే తప్పుడు

వైఖరుల నుంచి, ప్రజల పట్ల వైమనస్యానికి దారితీసే తప్పుడు వైఖరి నుంచి ఈ సూత్రాలు పార్టీని బయట పడవేస్తాయి.

అప్పటికి 12 లక్షల పదివేల మంది పార్టీ సభ్యులున్నారు. ఎర్రసైన్యం 9 లక్షల 10 వేలకు, ప్రజా మిలీషియా బలం ఇరవై మూడు లక్షలకు పెరిగింది. ఆత్మరక్షణ దళాలలో సభ్యుల సంఖ్య ఒక కోటికి చేరుకుంది. 19 విముక్తి ప్రాంతాలు ఏర్పడ్డాయి. వీటి వైశాల్యం 9 లక్షల 50వేల చదరపు కిలోమీటర్లు. ఇందులో సుమారు పదికోట్ల మంది జనాభా ఉన్నారు.

జపాన్ ఓటమి అంచులకు చేరటం ఖాయమని తేలిన దగ్గరనుండి అమెరికా కొమింగ్ టాంగ్ సైన్యాలకు ఆర్థిక ఆయుధ సరఫరాలను పెంచి కమ్యూనిస్టులను అధికారానికి ఆమడ దూరంలో పెట్టాలని ప్రయత్నించింది. ఈ విధానాలను ఖండిస్తూ మావో "ప్రస్తుత జపాన్ వ్యతిరేక యుద్ధానికి, భవిష్యత్తు ప్రపంచశాంతికి అమెరికా ఆటంకంగా పరిణమిస్తుంది" అని ప్రకటించాడు.

రెండవ ప్రపంచ యుద్ధంలో నాజీ జర్మనీపై సోవియట్ యూనియన్ తిరుగులేని విజయం సాధించిన తర్వాత, ఆగస్టు 8న సోవియట్ యూనియన్ జపానుపై యుద్ధాన్ని ప్రకటించి చైనా ఈశాన్య ప్రాంతంలోకి తన సైన్యాలను నడిపించింది. జపాను సైన్యపు వెనుక భాగం నుండి చైనా ప్రజా విముక్తి సైన్యం గెరిల్లా దాడులతో చీకాకుపరుస్తూ విముక్తి ప్రాంతాలను విస్తరించుకుంటూ పోయింది. 1945 సెప్టెంబర్ 2న తాను లొంగిపోయినట్లుగా జపాను సంతకం పెట్టింది.

విముక్తి యుద్ధ దశ ముగిసిన వెంటనే శాంతి స్థాపన కోసం, ప్రజాతంత్ర పాలన కోసం చైనా కమ్యూనిస్టు పార్టీ ఎంత ప్రయత్నించి నప్పటికీ అమెరికన్ సామ్రాజ్యవాదుల జోక్యంతో ఛాంగ్ కైషేక్ కమ్యూనిస్టుల విముక్తి ప్రాంతాలపై సరికొత్త దాడులకు పథక రచన చేశాడు. ప్రధాన వైరుధ్యంలో విప్లవ ఎత్తుగడలలో మళ్ళీ మార్పు వచ్చింది. విముక్తి యుద్ధం స్థానంలో ఛాంగ్ కై షేక్ చైనా ప్రజలపై రుద్దిన అంతర్యుద్ధం మరోసారి ముందుకు వచ్చింది. దళారీ బూర్జువా భూస్వామ్య వర్గాల ప్రతినిధి అయిన ఛాంగ్ కై షేక్ అభివృద్ధి నిరోధకశక్తుల పాలకుడిగా ప్రజలు పోరాడి సాధించుకున్న అనేక ప్రజాతంత్ర విజయాలను వమ్ముకావిస్తూ దాడులకు బరితెగించాడు. ప్రపంచంలోనే అతి పెద్ద మార్కెట్ అయిన చైనాపై ఆధిపత్యం కొరకు ప్రపంచ సామ్రాజ్యవాద మొనగాడుగా రెండవ ప్రపంచ యుద్ధానంతరం రంగం మీదకు వచ్చిన అమెరికా సామ్రాజ్యవాదం తన దోపిడీ ప్రయోజనాలకోసం నిస్సిగ్గుగా ఛాంగ్ కై షేక్‌కు అండగా నిలిచింది. కొమింగ్ టాంగ్ పార్టీ ఒకనాటి తమ నాయకుడైన డా॥సన్ యెట్ సేన్ సిద్ధాంతాలను ఖూనీ చేయటానికే పూనుకున్నది. శాంతికోసం చైనా ప్రజల ఆర్తిని ప్రగతి నిరోధకులు ఎంతగా అశ్రద్ధ చేశారో అంతగా వాళ్ళు రాజకీయంగా ఏకాకులయారు. వీరి అంతర్యుద్ధ సన్నాహాలను ఎండగడుతూనే, విముక్త ప్రాంతాలను విస్తరింపచేయటానికీ అంతవరకూ విడివిడిగా వున్న వాటిని కలపటానికీ చై.క.పా. ఎర్ర సైన్యాన్నీ, ప్రజలనూ నడిపింది. వ్యవసాయ విప్లవ సంస్కరణలను ముందుకు తీసుకు వెళ్ళటంలోనూ, విముక్తి ప్రాంత ప్రజలకు నాయకత్వం వహించటంలోనూ ముందుండి అభివృద్ధి నిరోధకుల ఓటమికీ దారులు వేసింది.

అమెరికా ఆర్థిక మిలటరీ తోడ్పాటు లేకుండా పరిపాలన చెయ్యలేని కొమింగ్ టాంగ్ ప్రగతి నిరోధకులు తమ పాలనను కాపాడు కునేందుకు ప్రజల ప్రతిఘటన ఉద్యమాలపై మిలటరీ దాడులు, రాజకీయ వంచన అనే రెండు ముఖ్యమైన పద్ధతులను ఉపయోగించారు. అయినా ఆ రెండు పూర్తిగా విఫలమయ్యాయి. రెండవ ప్రపంచ యుద్ధానంతరం చైనా ప్రజలపై రుద్దిన అంతర్యుద్ధాన్ని నాలుగు సంవత్సరాల వీరోచిత పోరాటం తర్వాత సామ్రాజ్యవాదుల ప్రగతి నిరోధక కొమింగ్ టాంగ్ చీకటి పాలనను కూలదోశారు. జనతా ప్రజాతంత్ర నియంతృత్వం క్రింద మహత్తర జనచైనా రిపబ్లిక్‌ను స్థాపించారు. ఈ విజయం పొందటం వెనుక అంతర్జాతీయ శ్రామికవర్గ శక్తులు, సోషలిస్టు శిబిరము, నాజీ ఫాసిస్టు శక్తులపై మహత్తర విజయం సాధించిన సోవియట్ యూనియన్ ఉన్నాయి. 8 సంవత్సరాల పాటు జపాన్‌కు వ్యతిరేకంగా సాగిన ప్రతిఘటన యుద్ధంలో కాకలు తీరిన చైనా ప్రజలు తమ రాజకీయ చైతన్యాన్ని నిర్మాణ సామర్థ్యాన్ని గొప్పగా పెంచుకున్నారు. శక్తివంతమైన విముక్తి ప్రాంతాలను, త్యాగ పూరితమైన ప్రజా విముక్తి సైన్యాన్ని సృష్టించుకున్నారు. వీటన్నిటికి మించి మార్క్సిస్టు- లెనినిస్టు సిద్ధాంతాన్ని చైనా దేశపు నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించుకోవడం ద్వారా ఈ విజయాన్ని సాధ్యం చేసుకున్నారు. మొదట మితవాద అవకాశవాదంతో లక్షలాది పోరాట యోధులను కోల్పోయినా, ఆ తర్వాత వెంట వెంటనే అతివాద మహమ్మారి ముమ్మారు చుట్టుముట్టి ఉద్యమశక్తులను ప్రాంతాలను వినాశనానికి గురి చేసినా కామ్రేడ్ మావో అనుసరించిన సరి అయిన సిద్ధాంత, రాజకీయ, ఉద్యమ, మిలటరీ నిర్మాణ పంథా కారణంగా దేశాన్ని విముక్తి చేసుకోగలిగారు. అందుకై సరైన గ్రామీణ, పట్టణ ఉద్యమ నిర్మాణ విధానాలను రూపొందించుకున్నారు. ఫలితంగా ప్రజా విముక్తి సైన్యం ఆత్మరక్షణ స్థితి నుండి దాడి స్థితిలోకి వేగంగా మారింది. అననుకూల స్థితినుండి అనుకూల స్థితిలోకి చేరింది. ఫలితంగా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసుకోగలిగారు. 1949 అక్టోబర్ ఒకటవ తేదీన తమ విప్లవ విజయాన్ని ప్రకటించుకుని జన చైనాను నిర్మించటం వైపుకి సాగ గలిగారు.

ఈ రచనకు తోడ్పడిన పుస్తకాలు:


1. ఆధునిక చైనా విప్లవ చరిత్ర- రచన హొూ కాంచీ.
2. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం-దాని పరిణామం - రచన: చంద్ర పుల్లారెడ్డి, మానికొండ సుబ్బారావు.
3. రేపటి చైనా-2001 రచన: హాన్ సూయిన్
4. చౌ ఎన్ లై రచనలు-సంపుటి 1


***